For scrolling/breaking

Media Release

Date -25.11.2017

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో కొత్త భవనానికి శంకుస్థాపన
- ఆరున్నర కోట్లతో నూతన పరీక్షల భవనం నిర్మాణం
- విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి
- తెలంగాణ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల పటిష్టతకు 420 కోట్ల రూపాయలిచ్చింది
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీకి 20 కోట్ల రూపాయలిచ్చాం
- లక్షన్నర విద్యార్థులు ఏటా నమోదు అవుతున్న విశ్వవిద్యాలయం
- 1550 ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేయడానికి విశ్వవిద్యాలయాలకే అధికారం
- కాంట్రాక్టు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనాలు పెంచాలని నిర్ణయం
- పోటీ పరీక్షలన్నీ ఆన్ లైన్ నిర్వహించాలని నిర్ణయం
- ఆలస్యం చేయకుండా కోర్టు తీర్పు మేరకు టీచర్ల నియామకం త్వరితగతిన చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 25 : లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా హైకోర్టు తీర్పునకు లోబడి టీచర్ల నియామకం త్వరితగతిన చేస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. హైకోర్టు తీర్పుపై ప్రస్తుతం సమీక్ష చేస్తున్నామని త్వరలోనే పది జిల్లాల మేరకు నియామక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. 31 జిల్లాల వారిగా నియామకాలు చేపడితే ఏజన్సీ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశ్యంతో 31 జిల్లాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, దీనిని కోర్టు రద్దు చేయకుండా 10 జిల్లాలకు చేయమనడంతో ఆ విధంగా చేయడానికి కసరత్తు చేస్తున్నామన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 6.22 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నిర్మించనున్న పరీక్షల విభాగం భవనానికి ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి నేడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...గతంలో

విశ్వవిద్యాలయాలను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను పటిష్టం చేసేందుకు 420 కోట్ల రూపాయలను ఇచ్చిందన్నారు. ఇందులో 20 కోట్ల రూపాయలు బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీకి వచ్చాయన్నారు. ఈ నిధులనుంచే నేడు పరీక్షల విభాగం భవనానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు.

విశ్వవిద్యాలయాల్లో 1550 ఖాళీలను కూడా భర్తీ చేసేందుకు వీసీల కమిటీ వేశామని, ఈ కమిటీ నివేదిక ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఈ పోస్టులను భర్తీ చేసుకునేందుకు యూనివర్శిటీలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చిందని తెలిపారు. ఈ భర్తీ బాధ్యత పూర్తిగా యూనివర్శిటీలకే ఇచ్చామని చెప్పారు. అదేవిధంగా అక్కడి కాంట్రాక్టు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనాలు పెంచేందుకు కూడా వీసీల కమిటీ ఆమోదం తెలిపిందని, త్వరలో వేతనాలు పెరుగుతాయన్నారు.

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ కె. సీతారామారావు, రిజిస్ట్రార్ సి. వెంకటయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.